రెవెన్యూ పట్టాలు ఇవ్వాలని వినతి



సిరికొండ : ఎన్నో ఎండ్లుగా సాగు చేసుకుంటున్న పిపి ల్యాండ్స్ భూములకు రెవెన్యూ పట్టాలు ఇవ్వాలని కోరుతూ ఉట్నూర్ ఐటిడిఏ కార్యాలయంలో పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు బుధవారం లచ్చింపూర్-బి గ్రామ పంచాయతీలోని గిరిజన రైతులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు దాదాపుగా 80 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు లేవని, ఇంతకుముందు రెవెన్యూ అధికారులు సర్వే చేసిన ఇప్పటివరకు పట్టాలు రాలేదని అన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో దాదాపుగా 400 మంది రైతులకు పిపి ల్యాండ్స్ ఉన్నాయని తెలిపారు. రెవెన్యూ పట్టాలు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలకు నోచుకోవడం లేదన్నారు. రైతులకు పట్టాలిచ్చి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రాథోడ్ రవీందర్, లస్మన్న, చౌహాన్ ప్రేమ్‌సింగ్ పాల్గొన్నారు.

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

గురువారం 27 జులై 2023

1

గ్రామస్తులకు చట్టాలపై అవగాహన



నేరడిగొండ : మండలంలోని రోల్‌మామడ, వాంకిడి గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల న్యాయ సేవా అధికార సంస్థ బోథ్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు బుధవారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోథ్ బార్ అసోసియేషన్ సెక్రెటరీ పంద్రం శంకర్ మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు గ్రామంలో చట్టాల గురించి ప్రజలను జాగృతి చేయాలని ఉద్దేశంతో కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మోటార్ వెహికల్, బాల్యవివాహాలు, భార్యాభర్తల తగాదాలు, యాక్సిడెంట్, డ్రైవింగ్ లైసెన్స్ గురించి అవగాహన కల్పిస్తూ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జమీర్, కోర్టు పిసి రమేష్, స్రవంతి, నజీర్, రాయసింగ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టపగలే దోపిడీ

నవతెలంగాణ-ఇచ్చోడ

ఎప్పుడూ రద్దీగా ఉండే కాలనీలో పట్టపగలే దోపిడీ దొంగలు ఓ వ్యాపారి ఇంట్లో చొరబడి అందినకాడికి దోచుకెళ్లిన ఘటన బుధవారం మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు, ఇంటి యజమాని తెలిపిన వివరాల ప్రకారం విఠలేశ్వర మందిరం కాలనీలో వెలిశాల గణేశ్ వ్యాపారి కుటుంబం నివాసం ఉంటోంది. ఉదయం కుమారుడు, కోడలు కలిసి వ్యాపారం పనిపై హైదరాబాద్ వెళ్లారు. సదరు వ్యాపారి గణేశ్ ఓ ఫంక్షన్‌కు అటెండ్ అయ్యాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు పగుల గొట్టారు. ఇంట్లో ఉన్న 30 తులాల బంగారం, 30వేల నగదు దోచుకెళ్లారు. సాయంత్రం ఫంక్షన్ ముగించుకుని ఇంటికి వచ్చిన వ్యాపారికి ఇంట్లో బీరువా పగులగొట్టి ఉండటం, నగదు, బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ చంద్రశేఖర్, ఎస్సై నరేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామీణుల ఐక్యతకు ప్రతీక పీర్ల పండగ



నవతెలంగాణ-తలమడుగు

తెలంగాణ రాష్ట్రంలోనే రుయ్యాడి గ్రామ హసేన్ హుస్సేన్ పీర్ల పండగ ఉత్సవాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఐక్యతకు నిదర్శనమని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం రుయ్యాడి గ్రామ పీరీలను దర్శించుకున్నారు. కుల మతాలకు అతీతంగా మొహరం పండుగను జరుపుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మొహరం పండుగ సందర్భంగా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా భక్తులు గ్రామస్తులు శాంతియుతంగా పండగను నిర్వహించుకోవాలన్నారు. ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రంలోనే మొహరం పండుగను ఘనంగా జరుపుకోవడం ఆనందకరమని తెలిపారు. మొహరం పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. నేటి యువత చదువుపై శ్రద్ధ కనబరిచి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ముందుగా గ్రామస్తులు డప్పు చప్పులతో ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. జిల్లా పోలీస్ అధికారి వెంట మాజీ విజయ డెయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి, గ్రామ సర్పంచ్ పోతారెడ్డి, గ్రామస్తులు గంగాధర్, ప్రకాష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, భీమన్న, బాలాజీ, అశోక్, గంగారెడ్డి, రూరల్ సీఐ సైదారావు, ఎస్సై ధనశ్రీ ఉన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి బెల్టు షాపుల వ్యవహారం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను అరికట్టాలని తుడుందెబ్బ, మానవహక్కుల వేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రేఖానాయక్ దృష్టికి తెచ్చారు. బుధవారం ఆమె మండల పర్యటనకు వచ్చిన సందర్భంగా మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు కాంబ్లే అతీష్, తుడుందెబ్బ నాయకులు జగ్గక్ భరత్ ఆధ్వర్యంలో వివిధ కిరాణా షాపులలో అమ్ముతున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని ఎమ్మెల్యేకు చూపించారు. మండలంలో బడి గుడి అనక విచ్చలవిడిగా బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయని తెలిపారు. అరికట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆనంద్‌రావ్, పుర్క చిత్తు, హన్మంతు ఉన్నారు.

అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్

వైద్య ఆరోగ్య శాఖలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేయాలని తెలంగాణ మెడికల్, హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్‌ను కలిసి వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా నాయకులు సుభాష్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న అన్ని విభాగాల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏజెన్సీల ద్వారా కాకుండా ప్రభుత్వమే నేరుగా ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి బోర్డు ద్వారా ప్రతినెల జీతాలు చెల్లించాలన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

బజార్‌హత్నూర్ : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ భీంరావ్ అన్నారు. గిరిజన ఆశ్రమ స్పోర్ట్స్ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్క విద్యార్థి అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో దోమలవల్ల వ్యాపించే వ్యాధులు(మలేరియా,డెంగు, టైఫాయిడ్), కలుషిత నీరు తాగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ తదితరు వ్యాధులు బారిన పడకుండా దోమతెరలు వినియోగించుకోవాలన్నారు. ఎవరికైనా జ్వరం, ఇతర వ్యాధులు వస్తే వెంటనే పిహెచ్‌సికి రావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గొడం చందన్, సూపర్‌వైజర్ జాదవ్ దేవిదాస్, హెచ్ఏ కాశీరామ్, ఏఎన్ఎం శ్రీదేవి, అర్చన పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సీఎం ధ్యేయం

ఇంద్రవెల్లి : తెలంగాణ రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయమని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. బుధవారం ఆమె మండలంలోని ముత్నూర్, ఇంద్రవెల్లి రైతు వేదికలో రైతులనుద్దేశించి మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి రైతులకు మూడు, నాలుగు గంటలే కరెంటు సరిపోతుందని అనడం సిగ్గుచేటన్నారు. అటువంటి పార్టీలను రాబోయే ఎన్నికల్లో భూస్థాపితం చేయాలన్నారు. రైతుల పక్షాన నిలబడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ ప్రభుత్వమని పేర్కొన్నారు. సీఎం కెసిఆర్ రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ముందుగా 14మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరామ్ నాయక్, జిల్లా కోఆప్షన్ సభ్యులు అంజద్, నాయకులు సోఫియాన్, సర్పంచ్ కొరెంగ గాంధారి, దేవ్‌పూజె మారుతి పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!

- ప్రమాదకరంగా మారిన జాతీయ రహదారి
- భారీ స్థాయిలో గుంతలు..వాహనదారుల బెంబేలు
- నెలల తరబడి అస్తవ్యస్తంగా ఉన్నా పట్టించుకోని గుత్తేదారు
- పర్యవేక్షణ మరిచిన నేషనల్ హైవే అథారిటీ అధికారులు

అదో జాతీయ రహదారి..ప్రమాదాలకు ఆస్కారం లేకుండా సాఫీగా ప్రయాణించేందుకు నిర్మించిన మార్గం. చూడటానికి అందంగా కనిపిస్తున్న ఈ రహదారిపై ప్రయాణం మాత్రం నరక ప్రాయాన్ని తలపిస్తోంది. ప్రయాణం సాఫీగా సాగేందుకు నిర్మించిన ఈ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. భారీ స్థాయిలో గుంతలు పడి అస్తవ్యస్తంగా మారింది. ఈ రహదారి సవ్యంగా లేక రోజుల వ్యవధిలోనే ఎక్కడో చోట ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత గుత్తేదారు పట్టించుకోవడం లేదు. రహదారి నిర్వహణను తరుచూ పర్యవేక్షించాల్సిన జాతీయ రహదారుల సంస్థ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. ఫలితంగా ఈ రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది గాయపడిన సంఘటనలు ఉన్నాయి. కానీ అధికారులు మాత్రం మేల్కోవడం లేదనే ఆరోపణలున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నిర్మించిన 44వ జాతీయ రహదారి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల మీదుగా వెళ్తుంది. ఈ రెండు జిల్లాల మీదుగా సుమారు 100కిలో మీటర్ల వరకు ఉంటుంది. గత కొన్ని నెలలుగా ఈ రహదారిపై భారీ స్థాయిలో గుంతలు పడి ఉండటంతో అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ జాతీయ రహదారి నిర్మాణంలో పలు లోపాలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల బ్రిడ్జిలు నిర్మించకపోవడం.. మరికొన్ని చోట్ల సర్వీసు రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడం.. సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను వదిలేయడం, ఇంకొన్ని చోట్ల బస్టాండ్‌లు నిర్మించలేదనే విమర్శలున్నాయి. దీనికి తోడు రహదారి నిర్వహణలోనూ చాలా లోపాలు ఉన్నట్లు తెలుస్తోంది. సుమారు ప్రతి వంద మీటర్లకు ఓ గుంత ఉండటం.. ఒకే దగ్గర పది వరకు గుంతలు ఉండటంతో భారీ వాహనాలతో పాటు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నెలల తరబడి అస్తవ్యస్తంగా ఉంటున్నా మరమ్మతులు చేపట్టడం లేదు. వాహనాల నుంచి టోల్ ఫీజు వసూలు చేస్తున్నా ఇందుకు తగిన సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదని పలువురు వాహనదారులు చెబుతున్నారు.

నిబంధనలు విస్మరిస్తున్న గుత్తేదారు..!

రహదారి నిర్మాణ బాధ్యతలు చేపట్టిన కంపెనీలు నిబంధనలు విస్మరిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. పనులు దక్కించుకున్న సదరు కంపెనీ ప్రతి ఐదేండ్లకు ఒకసారి రెన్యూవలు పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఒప్పందం ముగిసే వరకు రహదారి నిర్వహణ బాధ్యతలు ఆ కంపెనీ చూసుకోవాల్సి ఉంటుంది. కానీ సబ్ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి చేతులు దులుపుకుంటోందనే వాదనలున్నాయి. జిల్లాలో ఈ రహదారిపై పోలీసుశాఖ 11 చోట్ల బ్లాక్‌స్పాట్లు గుర్తించినా వాటిని సరిచేయడంలో సంబంధిత కంపెనీ నిర్లక్ష్యం వహిస్తోందని తెలుస్తోంది. గుడిహత్నూర్ నుంచి పెన్‌గంగా వంతెన వరకు అనేక చోట్ల భారీ స్థాయిలో గుంతలు పడి ఉన్నా వాటికి మరమ్మతులు చేపట్టడం లేదు.జాతీయ రహదారుల సంస్థ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారు మరమ్మతులు పనులు చేపట్టడం లేదని తెలుస్తోంది. రహదారి నిర్వహణ నిబంధనలు గాలికొదిలేయడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందనే ఆరోపణలున్నాయి.

భయం..భయంగా ప్రయాణం..!

జిల్లా మీదుగా వెళ్తున్న జాతీయ రహదారిపై ప్రయాణం నిత్య నరకంగా మారుతోంది. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారి మీదుగా వెళ తాయి. గుడిహత్నూర్ నుంచి పెన్‌గంగా నది వరకు భారీ స్థాయిలో గుంతలు ఉండటంతో జిల్లా సరిహద్దు వరకు రాగానే వాహనదారులు భయం..భయంగా నడపాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలతో పాటు ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ఆటోలు, ఇతర చిన్న వాహనాలు సైతం జనాన్ని తీసుకొని వెళ్తుంటాయి. రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో రెప్పపాటులోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వర్షం కురిసిన సందర్భాల్లో వర్షపునీరు గుంతల్లో రోజుల తరబడి నిల్వ ఉండటం.. రాత్రి వేళలో వాహనదారులకు సక్రమంగా కనిపించడం లేదు. దీంతో వాహనం అదుపు తప్పి కింద పడటంతో ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోతుందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వ్యభిచార ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో ఆరుగురు
- రిటైర్డ్ ఉద్యోగికి ఓ యువతి వల





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలను బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ ఉమేందర్ వెల్లడించారు. జిల్లా కేంద్రంలో ఉంటున్న ఓ రిటైర్డ్ ఉద్యోగి తన రిటైర్మెంట్ జీవితాన్ని గడుపుతున్నాడు. ఆయన జీవితంలోకి అనుకోకుండా ఓ యువతి వచ్చింది. ఆమె మాయమాటలకు పడిపోయాడు. ఆ యువతి ఒకరోజు పట్టణంలోని వాల్మీకినగర్‌లో తన రూంకి తీసుకెళ్లింది. లోపలికి వెళ్లాక బట్టలన్నీ విప్పి ఆయనను న్యూడ్‌గా ఫొటోలు, వీడియోలు తీసింది. వెంటనే ఆ యువతి తన అసలు రూపం బయటపెట్టింది. ఫొటోలు తీసిన వెంటనే తన ముఠా సభ్యులకు సమాచారం అందించింది. ముఠా సభ్యులు రూంలోకి చొరబడ్డారు. ఒకరు లవర్‌గా యాక్ట్ చేయగా మిగతా వాళ్లు షీ టీమ్ నుంచి వచ్చామని అబద్ధం చెప్పారు. ఆ దెబ్బకు రిటైర్డ్ ఉద్యోగి వణికిపోయాడు. తనకే పాపం తెలియదని, తనని విడిచిపెట్టాలని కోరాడు. తమకు రెండు లక్షలు ఇస్తేనే విడిచిపెడతామని, లేకపోతే పోలీస్‌స్టేషన్‌కి తీసుకెళ్తామని బెదిరించారు. అప్పుడు తన వద్ద ఉన్న నగదుతో పాటు సెల్‌ఫోన్, బంగారం ఇచ్చి అక్కడి నుంచి ఆయన తప్పించుకున్నాడు. అనంతరం పోలీసుల్ని ఆశ్రయించాడు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆ రిటైర్డ్ ఉద్యోగి ఇచ్చిన సమాచారంతో హనీ ట్రాప్ ముఠాలోని ఆరుగుని సభ్యుల్ని అదుపులోకి తీసుకున్నారు.

ఇంటికి అద్దె ఇచ్చే వారు జాగ్రత్త

జిల్లా కేంద్రంలో ఎవరైన బయట వాళ్లకు ఇళ్లు అద్దెకు ఇచ్చేటప్పుడు పూర్తి వివరాలు తెలుసుకొని ఇవ్వాలని డీఎస్పీ ప్రజలకు సూచించారు. ఇలాంటి వ్యభిచార వ్యవహారం నిర్వహిస్తే వారిపై కేసులు నమోదు చేసి ఇంటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైన బ్లాక్ మెయిల్‌కు ప్రయత్నం చేస్తే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. మీడియా సమావేశంలో సీఐ నారాయణ పాల్గొన్నారు.

అక్షరాస్యతలో ఆదిలాబాద్‌ను ముందు వరుసలో నిలపాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అక్షరాస్యతలో జిల్లాను ముందు వరుసలో నిలపాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం టిటిడిసి సమావేశ మందిరంలో రాత్రి బడి వాలంటీర్లకు నిర్వహించిన సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్షర క్రమంలో ముందున్న ఆదిలాబాద్ జిల్లా అక్షరాస్యతలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం కోసం రాత్రి బడి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, వివిధ రంగాల్లోని నిరక్షరాస్యులకు ఆదాయ వ్యయాలు, బ్యాంకు లావాదేవీలు, ఇతరత్రా సమాచారం తెలుసుకోవడానికి చదువు ఎంతో అవసరమని తెలిపారు. మొదటి 47 హాబిటేషన్లలో రాత్రి బడి కార్యక్రమం ద్వారా 926 మంది విద్యనభ్యసిస్తుండగా, ఇప్పటి వరకు 827 మంది(90 శాతం) అక్షరాస్యులుగా మారడం జరిగిందని వివరించారు. 14 సంవత్సరాలు నిండిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా పదవతరగతి ప్రవేశం పొందడానికి అర్హులని తెలిపారు. పదవతరగతి, ఇంటర్మీడియేట్ ఓపెన్ స్కూల్ లో ప్రవేశానికి ఆగస్టు 10 వరకు, అలాగే అపరాధ రుసుముతో ఆగస్టు 31 వరకు గడువులోగా చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. స్వచ్ఛందంగా గ్రామీణ ప్రాంతాల్లోని రాత్రిబడి కేంద్రాలలో సామజిక సేవ దక్పథంతో సేవలందిస్తున్న వాలంటీర్లకు అభినందనలు తెలిపారు. అనంతరం రాత్రి బడి కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన పలువురికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను కలెక్టర్, శిక్షణ సహాయ కలెక్టర్ అందించారు. ఈ సమావేశంలో జిల్లా వయోజన విద్యా డిడి శ్రీనివాస్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ అశోక్, గ్రామీణాభివృద్ధి అధికారులు హేమలత, శోభ, గంగన్న, వాలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-సిరికొండ

కురిసిన భారీ వర్షాల వల్ల నారాయణ్‌పూర్ చెరువు కట్ట తెగిపోయి ఇళ్లల్లోకి నీరు చేరడంతో నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. దీంతో ఎంపీపీ అమృత్‌రావ్, జెడ్పిటిసి చంద్రకళ రఘురాం బుధవారం ఆ గ్రామాన్ని సందర్శించి గిరిజనులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు సర్వే చేసి బాధితులకు నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు మాజీకరావ్, బిజెపి మండల అధ్యక్షుడు అమూల్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు యాదవ్‌రావ్, కొమురం భీం ఆశయ సాధన కమిటీ మండల అధ్యక్షుడు పాండు, చిత్రు పటేల్, సీతారాం, లచ్చు పాల్గొన్నారు.

బోథ్ బంద్ సంపూర్ణం



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండల కేంద్ర బంద్ సంపూర్ణంగా జరిగింది. వివిధ రంగాల కార్మికులు ఆటోలతో ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో వంటావార్పు చేపట్టారు. రెవెన్యూ డివిజన్‌తో పాటు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయం కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కోర్టు కాంప్లెక్స్ భవనాన్ని పూర్తి చేయాలని, జనరల్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, 31 అంశాలతో డిమాండ్ చేస్తూ మండల బంద్ సంపూర్ణంగా, స్వచ్ఛందంగా జరిగింది. అస్తిత్వం, ఆత్మగౌరవం అభివృద్ధి కోసం ప్రత్యేక తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని, అవసరమైతే రిలే నిరాహార దీక్షలు నిరవధిక దీక్షలుగా మారుతాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు స్పందించి ముఖ్యమంత్రి కేసీఆర్ దగ్గరికి అఖిలపక్ష నాయకులకు తీసుకెళ్లాని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

తెరపైకి పిప్పల్‌ధరి మండలం

- ఏర్పాటుచేయాలని సమీప గ్రామస్తుల డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ మండలాన్ని ఇదివరకే మూడు మండలాలు మావల, ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ రూరల్‌గా విభజించగా మరో నూతన మండలం ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ప్రస్తుత ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని పిప్పల్‌ధరిని మండల కేంద్రంగా ఏర్పాటుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం పిప్పల్‌ధరి సాధన కమిటీని ఏర్పాటు చేశారు. నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తెలంగ్ బాపురావ్, ఉపాధ్యక్షులుగా కోడప లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా తాక్‌సాండే నీలకంఠ్, సహాయ కార్యదర్శిగా టేకం సోనేరావ్, కోశాధికారిగా టంకే నాగోరావ్, కార్యవర్గ సభ్యులుగా మడవి లక్ష్మణ్, టి గౌతం, ఆనంద్‌రావ్, అజయ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు తెలంగ్ బాపురావ్ మాట్లాడుతూ పిప్పల్‌ధరి గ్రామంతో పాటు చుట్టు పక్కల ఉన్న దాదాపు 10 గ్రామ పంచాయతీలు, 35 గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని అన్నారు. చుట్టు పక్కల గ్రామాలకు పిప్పల్‌ధరి సెంటర్ పాయింట్‌గా ఉందని, మా గ్రామాలు ఆదిలాబాద్ రూరల్ మండల కేంద్రానికి దాదాపు 40 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయని పేర్కొన్నారు. పిప్పల్‌ధరిని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే చుట్టు పక్కల గల గిరిజన గ్రామాలకు దూరం భారం తగ్గి ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతాయని తెలిపారు. వెంటనే నూతన మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పిప్పల్‌ధరి మండల సాధన కమిటి ఆధ్వర్యంలో న్యాయమైన పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు బాబారావు, కొండే అనిల్ ఉన్నారు.

4న చలో హైదరాబాద్

కార్మిక గర్జనను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-సారంగాపూర్

కార్మిక సమస్యల పరిష్కారానికి ఆగస్టు 4న హైదరాబాద్‌లో జరిగే కార్మిక గర్జనను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి రాజన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. బీడి పరిశ్రమలో పని చేస్తున్న అన్ని కేటగిరీలకు చెందిన బీడీ కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవన భృతి అమలు చేయాలని, ఈపిఎఫ్ కార్మికులందరికి కనీస పెన్షన్ రూ.6000 అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీడి పరిశ్రమను నిర్వీర్యం చేయడానికి 28శాతం జిఎస్టీని విధించడంతో కార్మికులకు నెలకు 9రోజులు అది కూడా సగం దినం పని దొరుకుతుందని అవేదన వ్యక్తం చేశారు. బీడీ పరిశ్రమను రక్షించడానికి కనీస వేతన జిఓ 41ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2016లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా దేశంలో ఏ ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. ఆగస్టు 4న మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లో జరిగే కార్మిక గర్జనను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.రామలక్ష్మణ్, ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు లక్ష్మి, గంగామణి, శోభ, కమల, సోఫియా పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) ఆధ్వర్యంలో కార్మిక హక్కుల సాధన కోసమై ఆగస్టు 4న హైదరాబాద్‌లో జరిగే కార్మిక గర్జనను విజయవంతం చేయాలని ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. గంగన్న కోరారు. మండలంలోని వడ్యాల్ గ్రామ దేశాయ్ బీడీ హెడ్ ఆఫీస్‌లో బుధవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కార్మిక గర్జన వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న మాట్లాడారు. ప్రావిడెంట్ ఫండ్ పెంచాలని దేశవ్యాప్తంగా కార్మికులు కోరినా, సిబిటి సిఫారసు చేసినా కేంద్రం ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కవిత, ముత్తవ్వ, ఆశన్న, లింగన్న, కిషన్, నారాయణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
గురువారం 27 జులై 2023

ప్రాథమిక సహకార సంఘంలో చోరీ

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు బద్దలు కొట్టి నగదును ఎత్తుకెళ్లారు. సీఐ భూమేష్ తెలిపిన వివరాల ప్రకారం ప్రాథమిక సహకార సంఘంలో రూ.12వేల నగదుతో పాటు సీసీ కెమెరాలు హార్డ్ డిస్క్ వస్తువులను మంగళవారం రాత్రి దొంగలించారు. క్లూ టీంతో వేలిముద్రలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలో వరుసగా దొంగతనాలు జరగడం ఒకేరోజు మూడు దుకాణాల్లో దొంగలు పడడంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-తాంసి



విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలోని పాలోది గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అడెపు శృతి(17) జిల్లా కేంద్రంలోని జ్యోతిబాపూలే జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతోంది. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. గ్రామస్తులు గమనించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఎస్ఐ శివరాం సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

కడుపు నొప్పితో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు



లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన టేకం సునీల్(32) కడుపు నొప్పి భరించలేక మంగళవారం రాత్రి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సునీల్ ఆరు నెలల నుండి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి గ్రామ సమీప చేనులో పురుగులమందు తాగి పడిపోయాడు. అదే గ్రామానికి చెందిన ఒకరు గమనించగా అదే రోజు రాత్రి రిమ్స్‌కు తరలించారు. అప్పటికే సునీల్ మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

సీఆర్ఆర్‌కు మాజీ మంత్రి నివాళి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాజీ మంత్రి రామచంద్రారెడ్డి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా ఆయనకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత పూలబొకేతో స్వాగతం పలికారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రిగా, ఎమ్మెల్యేగా రామచంద్రారెడ్డి సేవలు వెలకట్టలేనివని తెలిపారు.

పాఠశాలలో నీటి నిల్వల తొలగింపు

- నవతెలంగాణ వార్తకు స్పందన



నవతెలంగాణ-ఇచ్చోడ

జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిలిచిన నీళ్లను తొలగించారు. మోకాలు లోతు నీళ్లలో నడుచుకుంటూ వెళ్లి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని బుధవారం నవతెలంగాణలో వార్త ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి మురుగు కాల్వలను జేసీబీతో క్లియర్ చేయించడంతో పాఠశాల ఆవరణలో ఉన్న నీళ్లు వెళ్లిపోయాయి. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

రైతు బీమా పరిశీలన



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని వడ్యాల గ్రామానికి చెందిన రైతు కొండ్ర నారాయణ మంగళవారం ప్రమాదశవత్తు మరణించాడు. విషయం తెలిసిన వెంటనే బుధవారం వ్యవసాయాధికారి సంతోష్ బాధిత కుటుంబ సభ్యుల ఇంటికెళ్లి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఖాతాలో త్వరలో బీమా డబ్బులు జమ చేస్తామని వ్యవసాయాధికారి తెలిపారు.

కడెం ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు



నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్ట్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. అప్రమత్తమైన అధికారులు 5 గేట్లు ఎత్తి 26384 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 691.700అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 24170 క్యూసెక్కులు ఉంది. ప్రాజెక్ట్ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ఈవీఎంపై అవగాహన



నవతెలంగాణ-నార్నూర్

ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారంతో రెవెన్యూ సిబ్బంది ఈవిఎంలపై అవగాహన కల్పించినట్లు తహసీల్దార్ దుర్వా లక్ష్మణ్ పేర్కొన్నారు. బుధవారం గాదిగూడ మండలం పిప్రి గ్రామంలో ఓటరుదారుని ఈవిఎంచ వివి ప్యాట్ ద్వారా ఓటును ఎలా వేయాలో అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతిఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

వీర జవాన్ల త్యాగాలు మరువలేనివి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మాతృ భూమి రక్షణ కోసం శత్రు దేశాలతో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన వీర జవాన్ల త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. కార్గిల్ దివస్‌ను పురస్కరించుకొని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కార్గిల్ పార్క్‌లో అమర వీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళ్లర్పించారు. దేశ రక్షణలో సైనికుల త్యాగ నిరతిని గుర్తు చేసుకుంటూ వారి సేవలను కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ సైతం కార్గిల్ పార్క్‌లో అమర వీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళ్లర్పించారు. దేశ రక్షణలో సైనికుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కమిషనర్ శైలజ, నాయకులు పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో..

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినాయక్‌చౌక్‌లోని కార్గిల్ అమరవీరుల స్తూపం వద్ద కార్గిల్ విజయ్ దివస్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు ఘన నివాళి అర్పిస్తూ రెండు నిమిషాల మౌనం పాటించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సునీల్ చౌహాన్, వలబోజు గోపికృష్ణ మాట్లాడుతూ దేశాన్ని అనునిత్యం కంటికి రెప్పలా కాపాడే గొప్ప వీరులు సైనికులని, 1999లో పాకిస్తాన్‌లో జరిగిన యుద్ధంలో దాదాపు 500పైగా సైనికులు దేశం కోసం ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి బచ్చువార్ నారాయణ, జిల్లా నాయకులు అల్లూరి మనోజ్‌రెడ్డి, బత్తుల గంగాధర్, సింగిడి వెంకటరమణారెడ్డి, అర్బన్ మండల ప్రధాన కార్యదర్శి గాండ్ల అనిల్, కేశవ్, గోపాల్, గంగయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

దేశ రక్షణ కోసం ఆర్మీ జవాన్లు చేస్తున్న సేవలు మరువలేనివని డిసిసి అధ్యక్షుడు సాజిద్ ఖాన్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట అమరవీరుల స్థూపానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అమర జవాన్ల సేవలను స్మరించుకున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

కార్గిల్ యుద్ధంలో సైనికుల విరోచిత పోరాటాన్ని దేశ ప్రజలు ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి అన్నారు. బుధవారం కార్గిల్ విజయ దివస్ సందర్భంగా అమరవీరుల స్థూపానికి పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు.

దుర్గం ట్రస్ట్ ఆధ్వర్యంలో..

కార్గిల్ విజయ్ దివస్‌ను వినాయక్ చౌక్‌లో గల అమరవీరుల స్థూపం వద్ద దుర్గం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జై జవాన్, జై హింద్ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మదస్తు మహేందర్, లక్ష్మన్, మోహన్, రాహుల్, సూరజ్ సోన్, ఆశన్న పాల్గొన్నారు.

నడక నరకయాతన

- గ్రామానికి 108 వాహనం రాదు
- అత్యవసర సమయంలో ఎడ్ల బండే దిక్కు



నవతెలంగాణ-ఇచ్చోడ

బాబ్జీపేట గ్రామపంచాయతీ అనుబంధంగా ఉన్న లంబాడీతండా, సోమన్నగూడ, బొజ్జుగూడ, శివగూడ గ్రామాల్లో దాదాపు 120కి పైగా కుటుంబాలు నివాసముంటాయి. స్వాతంత్ర్యం వచ్చి 7దశాబ్దాలు దాటినా ఇప్పటికీ ఆ గ్రామాలకు 108 వాహనం రాలేదు. గ్రామానికి వెళ్లే రహదారి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రహదారి సౌకర్యం సరిగా లేక ఈ గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. నేటికీ ఎడ్లబండ్లపైనే ప్రయాణిస్తున్నారు. మండల కేంద్రానికి దాదాపు 26కిలో మీటర్ల దూరం, సిరిచెల్మ నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి ఈ గ్రామ పంచాయతీ. కోతకు గురైన మట్టి రోడ్డు, మధ్యలో కల్వర్టులు లేని పిల్ల కాలువ, ఇప్పటికీ మట్టితో కూడిన ఎడ్లబండ్ల తోవనే ఉంది. గిరిజనుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని, కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని పాలకులు చెబుతున్నా ఈ గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తంటాలు పడుతున్నారు. అత్యవసర సమయంలో ముఖ్యంగా గర్భిణులు ప్రసవానికి అవస్థలు పడుతున్నారు. 108 అంబులెన్స్ రావడానికి ఆటంకాలు కలుగుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రెండు పిల్లవాగులతో పాటు మట్టిరోడ్డు వర్షాలకు కోతకు గురైంది. కొన్నిచోట తాత్కాలికంగా కాల్వలో వేసిన పైపులు సైతం కొట్టుపోయి నడవడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, నాయకులు తమ గ్రామాలను పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే తమ గ్రామానికి బీటీ రహదారిని నిర్మించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సిబ్బందికి సూచించారు. బుధవారం టీఎంఆర్ఎస్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. అక్కడ అందుతున్న విద్య, భోజన, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. వంట గదిని స్వయంగా పరిశీలించారు. నిత్యావసర సరుకులను పరిశీలించి నిత్యం విద్యార్థులకు మంచి భోజనం వడ్డించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు చదువులో ఎలాంటి ఇబ్బందులు రానివ్వకుండా చూడాలని, సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని, ప్రతి విద్యార్థిపై దృష్టి సారించాలని తెలిపారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయం అంత తిరిగారు. నిజాం పాలనలో నిర్మించిన భవనం కావడంతో ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరుకుందని, కార్యాలయం అంత వర్షాలకు ఊరుస్తుందని కలెక్టర్ దృష్టికి తహసీల్దార్ భోజన్న తీసుకొచ్చారు. కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. ముందుగా మండలంలో శ్యాంపూర్ నుండి లక్కెటిపేట గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వాగుపై ఉన్న వంతెన ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతినడంతో తహసీల్దార్ భోజన్నతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలు నమోదు చేసి తెలుయజేయలన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-ముధోల్

కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తరోడ గ్రామంలో మాజీ ఎంపీపీ లక్ష్మీనర్సాగౌడ్‌ను మర్యాదపూర్వకంగా బుధవారం సాయంత్రం కలిశారు. కాంగ్రెస్ పార్టీలో చేరాలని సూచించారు. అనంతరం మాజీ మంత్రి విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ, అర్హులకు ఇండ్లు, ప్రతి ఇంట్లో భార్యాభర్తలకు కలిపి నాలుగువేల పింఛన్‌తో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తెలంగాణ అభివృద్ధిని పట్టించుకోని బీఆర్ఎస్ పార్టీకి ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి లక్ష్మీనర్సగౌడ్, విట్టోలి సర్పంచ్ సత్యగౌడ్, బాసర మాజీ సర్పంచ్ మమ్మయి రమేష్, నాయకులు పండరి గౌడ్, సాయిరెడ్డి, నర్సారెడ్డి, దశరథ్, మహబూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

ప్రజల ఇక్కట్లను పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రజల ఇక్కట్లను పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, ప్రతిపక్షాల కల్లిబొల్లి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే జోగు రామన్న స్పష్టం చేశారు. ఖానాపూర్, కెఆర్‌కె, కుమార్‌పేట్, రాంనగర్ కాలనీలలో ఏర్పాటుచేసిన సవారి బంగ్లా షెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు హాజరయ్యారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం దేశానికే ఆదర్శవంతమైన పథకాలను అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ పథకాలను ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీల నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ప్రస్తుతం మాయమాటలు చెప్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. త్వరలోనే అర్హులైన వారికి సొంత స్థలం ఉంటే ఇండ్లు నిర్మించుకునేలా ఆర్థిక సాయం అందిస్తామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే దిశగా అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు నవీన్, చంద్రయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

ఆశ్రమ, వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమాల్లో, ఏకలవ్య పాఠశాలలో, వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించాలని జై ఆదివాసీ యువశక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆడ హన్మంత్‌రావ్ అన్నారు. బుధవారం ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్‌ని కలిసి విన్నవించారు. హన్మంత్‌రావ్ మాట్లాడుతూ ఐటీడీఏలోని వివిధ సంస్థలోని బోధనేతర సిబ్బందిని అక్రమ డిప్యూటేషన్‌లు, ఇన్‌చార్జి పాలనలతో గిరిజన విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. అక్రమ డిప్యూటేషన్‌లు, ఇంచార్జి పాలనలకు స్వస్తి చెప్పి గిరిజన విద్యాను గాడిలో పెట్టాలని కోరారు. అదే విదంగా ఐటీడీఏ కార్యాలయంలోని ముఖ్య విభాగాలు ప్రక్షాళన చేయాలన్నారు. పీఓను కలసిన వారిలో వివిధ ఆదివాసీ నాయకులు తిరుపతి, చంద్రాబాన్, రాజేశ్వర్, నారాయణ ఉన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పట్టించుకోలేని అసమర్థత ప్రభుత్వం



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

రాష్ట్ర వ్యాప్తంగా 21 రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా పట్టించుకోని అసమర్థత బీఆర్ఎస్ ప్రభుత్వమని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేష్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం ముందు కార్మికుల సమ్మెకు మండల అధ్యక్షులు ఎం దేవేందర్, కిష్టన్నతో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదన్నారు. మల్టీ పర్పస్ విధానం రద్దు చేసి జీఓ 60 అమలు చేయాలని, బీమా, కార్మిక చట్టాలను అమలు చేయాలని, కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం పచ్చదనం పరిశుభ్రతలో అగ్రగామిలో ఉండి అనేక అవార్డులు రివార్డులు తెచ్చుకుంటుందని గొప్పలు చెబుతున్న ప్రభుత్వ అధినేత అంత గొప్ప అవార్డులకు కారణమైన పంచాయతీ కార్మికుల సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. తక్షణలో సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో కార్మికుల పక్షాన పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా నాయకులు గోటిముక్కల మధుకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా కో- కన్వీనర్ పాలెపు గణేష్, జిల్లా నాయకులు కలమడుగు రాజేందర్, మండల అధ్యక్షులు లింగంపల్లి సాయి, మోకిని రవి పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ



నవతెలంగాణ-ఖానాపూర్

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. మండలంలోని బీర్నంది జెడ్‌పిఎస్ఎస్ పాఠశాలలో 200 మంది విద్యార్థులకు నోట్ బుక్‌లను పంపిణీ చేసి పాఠశాల ఆవరణలో చెట్లను నాటారు. ఇటీవల ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థి జాడి సాయిరాజ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్ చైర్మన్ మహాజన్ జితేందర్, ఖానాపూర్ వాసవి క్లబ్ అధ్యక్షులు కిషన్, ప్రధాన కార్యదర్శి సామ లక్ష్మీనారాయణ, కోశాధికారి చిటికేశి సతీష్ కుమార్, వనిత క్లబ్ అధ్యక్షురాలు చిటికేశి మానస, ప్రధాన కార్యదర్శి చిటికేశి స్రవంతి, కోశాధికారి ఎలగందుల వరలక్ష్మీ, ఉపాధక్షురాలు చోల్లేటి శ్వేత, మహజన్ శారద, గ్రామ సర్పంచ్ సాగే సువర్ణ లక్ష్మణరావు, విద్యా కమిటీ చైర్మన్ పి.భూమేష్, ప్రధానోపాధ్యాయుడు సాయికృష్ణ, ఉపాధ్యాయలు మంత్రి ప్రకాష్, ప్రసాద్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో యూఐపీ సెషన్ సందర్భంగా బుధవారం గర్భిణులు, బాలింతలకు హెల్త్ సూపర్వైజర్ చరణ్‌దాస్ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. సబ్ సెంటర్ పరిధిలోని గర్భిణులు, బాలింతలు ఆసుపత్రికి వచ్చేటప్పుడు ఏఎన్‌సీ ఎమ్‌సిపి కార్డులను వెంట తెచ్చుకోవాలని సూచించారు. అలాగే ఎప్పటికప్పుడు ల్యాబ్ టెస్టులు చేయుంచుకోవాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, డయేరియా లాంటి సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వివరించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఫుడ్ పాయిజన్ కాకుండా రోజు వేడి ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. అవగాహన కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సత్తవ్వ, ఏఎన్ఎం షీలా, జంగు బాయి, ఆశాలు దుర్గే సుగుణ, ఆడే పంచపూల పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించాలి



నవతెలంగాణ-నార్నూర్

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీఓ కావల రమేష్ సూచించారు. బుధవారం గంగాపూర్‌లో హరితహారంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా కూలీలతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలు నాటే విధానంపై కూలీలకు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు చెట్లే ఆధారమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పెంచాలని కోరారు. చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయన వెంట టీఏ కైలాష్, కార్యదర్శి రమేష్ ఉన్నారు.

www.navatelangana.com

నవతెలంగాణ

మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

గురువారం 27 జులై 2023

ఉద్యమాల్లో ప్రజాపంథా ముందుంటుంది

నవతెలంగాణ-జన్నారం



ప్రజా ఉద్యమాలలో ప్రజాపంథా పార్టీ ముందుంటుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రమ, ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య అన్నారు. బుధవారం మండలం చింతగూడ గ్రామంలో పలువురు సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వారి సమక్షంలో ప్రజాపంథా పార్టీలో చేరారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, ప్రజల పక్షాన ప్రజాపంథా ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారు పురంశెట్టి బాపు, సట్ల సత్తన్న జక్కుల చంద్రయ్య, దుర్గం బుచ్చమ్మ, జాడి రమా రజిత, వెంకటమ్మ పద్మ తదితరులున్నారు.

అంకెపల్లి చెరువుకు గండి

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని చౌటపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంకెపల్లి చెరువుకు గండి పడింది. నిండిన చెరువుకు గండిపడడంతో చెరువులో నిలిచిన నీరు వృధాగా పోతోంది. నారుమళ్ళకు సన్నద్ధమవుతున్న రైతులు చెరువుకు గండి పడడంతో ఆందోళన చెందుతున్నారు. 80 ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ చెరువు కింద 50 మంది సాగు రైతులు ఉన్నారు. వెంటనే తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టినట్లయితే రైతులు పంట నష్టపోయే ప్రమాదం ఉంది. గండి పడిన చెరువును ఆర్ఐ మురళీధర్‌రావు ఇరిగేషన్ ఏఈ రవీందర్, కార్యదర్శి వసంత సందర్శించి పరిస్థితిని అంచనా వేశారు.

డీసీఆర్బీ సీఐగా రమేష్ బాధ్యతలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డీసీఆర్బీ సీఐగా రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేసి ఇటీవలే సీఐగా పదోన్నతి పొందారు. తిరిగి జిల్లా కేంద్రంలో సీఐగా బాధ్యతలు స్వీకరించారు. విధుల నిర్వహణలో అంకితభావంతో వ్యవహరించాలని ఆయనకు ఎస్పీ సూచించారు.

బన్న ఆశాలుకు కోదండరాం పరామర్శ



నవతెలంగాణ-కాసిపేట

మంచిర్యాల మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాసిపేట మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బన్న ఆశాలు ఇటీవల తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని కాసిపేట గ్రామానికి వచ్చిన టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం బుధవారం పరామర్శించారు. సర్పంచ్‌గా పని చేసిన రోజుల్లో గ్రామ, మండల అభివృద్ధికి విద్య, వైద్య, మౌలిక సదుపాయాల కల్పనకు ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. తెలంగాణ మాలి దశ ఉద్యమంలో వయస్సుతో నిమిత్తం లేకుండా ఉద్యమం లో భాగస్వామ్యం చాలా గొప్పదనిఅన్నారు. 6 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా ఉన్న ఆశాలు ప్రతి ఒక్కరికి ఆదర్శం అని కోదండరాం అన్నారు. కోదండరామ్‌తో బాబన్న, గోనెల శ్రీనివాస్, శిలోజ్ మురళి, మద్దవేని చిన్న భీమయ్య సిద్ధం బాపు, సిద్ధం రాములు, మల్లేష్, రాజలింగు పాల్గొన్నారు.

తెగిపోయిన కల్వర్టు.. నిలిచిన రాకపోకలు



నవతెలంగాణ-తాండూర్

భారీ వర్షాలకు మండలంలోని చౌటపల్లి గ్రామపంచాయతీలో కల్వర్టు తెగిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చౌటపల్లి చెరువు నీరు కల్వర్టు మీదుగా ప్రవహించడంతో కల్వర్టు ధ్వంసం అయింది. దీంతో పోచంపల్లి, చౌటపల్లి, లింగదరి, గూడెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రైతులు గ్రామస్తులు పశువుల కాపరులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కల్వర్టు తెగిపోవడం వల్ల ఎమర్జెన్సీ సర్వీసులు సైతం గ్రామాలకు వచ్చే పరిస్థితి లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం కల్వర్టు మరమ్మత్తుల కోసం పంచాయతీరాజ్ నుండి రూ.40 లక్షలు మంజూరైనప్పటికీ పనులు చేపట్టలేదని సర్పంచ్ చిమల శంకర్ ఆరోపించారు. కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా టెండర్ వర్క్ పూర్తయిందని కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకోకపోవడం వల్ల కల్వర్టు నిర్మాణ పనులు జరగలేదని ఏ ఈ అప్పలనాయుడు తెలిపారు. కల్వర్టు తాత్కాలిక మరమ్మత్తుల చేసి ప్రజా రవాణాను పునరుద్ధరించాలని అక్కడి ప్రజలు కోరారు.

ఛత్రపతి సాహూ మహారాజ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

- మంచిర్యాలలో ఘనంగా రిజర్వేషన్స్ డే సంబరాలు



నవతెలంగాణ-హాజీపూర్

ఛత్రపతి సాహూ మహారాజ్ అందించిన రిజర్వేషన్ల రక్షణతో పాటు సమగ్ర సామాజిక న్యాయ సాధన కోసం దేశంలోని బహుజనులందరు ఐక్యంగా ఉద్యమించాలని వివిధ సామాజిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మంచిర్యాలలోని బీసీ ఐక్యవేదిక సంఘ భవనంలో జరిగిన 121 వ రిజర్వేషన్స్ డే సభ సందర్భంగా వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఛత్రపతి సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ల అర్పించారు. మన దేశంలో రెండు వేల సంవత్సరాలు కొనసాగిన సామాజిక దోపిడీని నిర్మూలించే దిశలో తొలి అడుగు నేటికి 121 ఏళ్ళక్రితం ఇదే రోజున పడిందని వారు తెలిపారు. తన సంస్థానంలోని ఉద్యోగాలపై అగ్రవర్ణాల కబ్జాను కట్టడి చేస్తూ.. బడుగు వర్గాలకు యాభై శాతం కేటాయిస్తూ 1902 జూలై 26న శాసనం జారీ చేసిన కొల్హాపూర్ రాజు సాహుమహారాజ్ దేశ చరిత్రలో మహనీయుడిగా నిలిచిపోయాడని వారు పేర్కొన్నారు. నేటి కాలపు మనువాదులు పన్నుతున్న కుట్రలను ఎదుర్కోవడానికి, సామాజిక న్యాయాన్ని నిలబెట్టడానికి ఎస్సీ ఎస్టీ బీసీ బిడ్డలందరూ ఐక్యమై బహుజన చైతన్యంతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బీసీ వర్గాల కులగణన చేపట్టకుండా తాత్సారం చేస్తున్న మోడీ సర్కార్ దేశంలోని మెజార్టీ వర్గాలను మోసం చేస్తున్నదని విమర్శించారు. అగ్రవర్ణాల కొమ్ము కాయడం మానుకొని.. మోడీ సర్కారు తక్షణమే బీసీ జనగణన చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, సీనియర్ న్యాయవాది కర్రె లచ్చన్న, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, గాండ్ల తిలకేశ్వర సంఘం జిల్లా అధ్యక్షులు బుద్ధి చంద్రమౌళి, సీనియర్ బీసీ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, సమ్ము రాజయ్య, మొగిలి తిరుపతి, గొర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ-కాసిపేట

గ్రామ పంచాయతీ లలో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి,ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారము కాసిపేట మండలంలోని గ్రామపంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె శిబిరాన్ని సందర్శించి వారికి సంపూర్ణ మద్దతును ప్రకటించారు. గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేయాలని అదేవిధంగా వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర జిల్లా, మండల నాయకులు రామ్‌రెడ్డి, బాబాన్న, ప్రసాద్, గోనెల శ్రీనివాస్, మద్దెవెని చిన్న భీమయ్య, శిలోజు మురళి, కాసిపేట మండల పంచాయితీ సిబ్బంది సంఘం నాయకులు దాసరి రాజన్న, గూకొండ శ్రీనివాస్, దీపక్, నర్సయ్య, చిన్నూ, బాపు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం..ఆగని పోరాటం

హాజీపూర్ : ఓ పక్క ఎడతెరిపి లేని వర్షం ..ఇంకో పక్క తమ సమస్యలు



పరిష్కరించాలని పంచాయతీ కార్మికుల సమ్మె బాట. పంచాయతీ కార్మికుల సమ్మె బుధవారానికి 21 వ రోజుకు చేరింది. మండల కేంద్రంలో జోరు వానలో కూడా పోరు ఆపకుండా నిరసన దీక్షలో పాల్గొన్నారు. కేసీఆర్ ఏ రోజుకైనా కేసీఆర్ కరునించరా అని ఆశాభావంతో వున్నామని పంచాయతీ కార్మికులు తెలిపారు. గుడిపెట్ సర్పంచ్ లగిషెట్టి లక్ష్మి రాజయ్యలు బోజన ఏర్పాట్లు చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-భీమారం

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల సాధనకై దశలవారిగా ఉద్యమిస్తున్న ఉపాధ్యయుల పట్ల సానుకూల దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం పరిగణించాలని తపాస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు కోరారు. ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలపై ఉద్యమిస్తున్న నేపథ్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ వాసంతికి వినత పత్రం అందజేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని, పండితుల, పీఈటీల పదోన్నతలు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న డిఏ, బిల్స్ వెంటనే చెల్లించాలని, పీఆర్‌సీ కమిటీ వేసి వెంటనే ఐఆర్ ప్రకటించాలని అన్నారు. 317 జీఓ ద్వారా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు సొంత జిల్లాలో అవకాశం కల్పించాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల, గిరిజన సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతీ పాఠశాలలో పారిశుధ్య కార్మికులను నియమించాలని, పాఠశాలలకు ఉచిత విద్యుత్తును ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కందికంటి శ్రీనివాసరావు, విజయకుమార్, గోపాల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి భీమనాథం, మహేశ్ పాల్గొన్నారు.

జైపూర్ : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని తపస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల సాధనకై దశల వారి ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం జైపూర్ మండల తహసీల్దార్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాష పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు, పెండింగ్ బిల్స్ వెంటనే చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాటేటి రమేశ్, గోపాల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పీవీకే ప్రసాద్, మహేశ్ పాల్గొన్నారు.

పద్మశాలీయులంతా ఏకతాటిపైకి రావాలి

- తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు చిల్లగాని సుదర్శన్

నవతెలంగాణ-హాజీపూర్

జిల్లా పరిధిలోని పద్మశాలీలంతా ఏకతాటిపైకి రావాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చిలగాని సుదర్శన్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో జిల్లా పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన వారితో కూడిన జిల్లా కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలాల వారీగా పద్మశాలీలను బాధ్యులుగా చేస్తూ 101 మందితో కూడిన జిల్లా జంబుబారిని ఏర్పాటు చేసుకున్నామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో పద్మశాలి భవన్ నిర్మాణం ప్రధాన లక్ష్యంగా ముందుకు పోతామని తీర్మానం చేసుకున్నారు. ఆగస్టు 13న పద్మశాలి కుల బాంధవులతో కోరుట్లలో నిర్వహించ తలపెట్టిన పద్మశాలి రాజకీయ యుద్ధభేరి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిధి నుండి 1000 మందికి తక్కువ కాకుండా ప్రతి మండలం నుంచి పద్మశాలి కుల బాంధవులు భారీగా తరలివెళ్లి కోరుట్ల వేదికగా పద్మశాలి బలం బలగం ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. దీనికి ముందు జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శిగా ఆవిడపు వెంకటేశం కోశాధికారిగా వెన్నం



లక్ష్మీనారాయణ ఉపాధ్యక్షులుగా చెలిమెల అంజయ్య ప్రచార కార్యదర్శిగా ఓం ప్రకాష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా అఖిలభారత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర సంఘాలలో వివిధ హోదాల ద్వారా పద్మశాలి సమాజానికి సేవలందించిన జిల్లా వాసి పొద్దున బాపూజీలు మంచిర్యాల జిల్లా సంఘానికి గౌరవ అధ్యక్షులుగా ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మధ్యకే కార్యదర్శులకు శాలువాలతో సన్మానించుకున్నారు.

హమాలీ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం తీసుకు రావాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో పనిచేస్తున్న సివిల్ సప్లై హమాలీ కార్మికులందరికీ హమాలి కార్మికుల సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలని సివిల్ సప్లై హమాలి వర్కస్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్టుపెల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారుగా 30 సంవత్సరాల నుంచి హమాలి కార్మికులు కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారని పేద, బడుగు, బలహీన వర్గాలకు నిత్యావసర వస్తువులు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. కరోనా సమయంలో కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రాష్ట్రంలోని నిత్యావసర వస్తువులను అందించి వారి ప్రాణాలను కాపాడారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హమాలీ కార్మికులను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 9,10 తేదీలలో నిర్వహించే మహాధర్నాలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు పిడుగు శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, గాదం సుధాకర్, మేకల శ్రీనివాస్, దత్తు, వెంకటి పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీజేపీ చేసిన దీక్ష సందర్భంగా వచ్చిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దరఖాస్తులను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు డబుల్ బెడ్ రూమ్‌ల కేటాయించడంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. తమ ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో రైతుల సాధికారత కోసం కృషి చేస్తున్నామన్నారు. డిజిటల్ వ్యవసాయ మిషన్ ద్వారా రైతుల ప్రయోజనాలు రక్షించడానికి ప్రవేశపెట్టిన రైతుల నుంచి మార్కెట్ విధానం నూతన ఒరవడిని సృష్టించిందన్నారు. నేడు మండలాల వారీగా ఎరువుల దుకాణాల పరిశీలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, శేర్ల మురళీధర్, జిల్లా కోశాధికారి అరుణ్, మండల అధ్యక్షుడు మద్దెల శ్రీధర్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి బహిష్కరణ



నవతెలంగాణ-జన్నారం

ఏఐకేఎంఎస్‌లో పని చేస్తున్న మండలంలోని చింతగుడా గ్రామానికి చెందిన పురంశెట్టి బాపు గత కొన్ని నెలలుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ, పార్టీ వ్యతిరేక విధానాలు అవలంబించడంతో అతనిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి లాల్ కుమార్ తెలిపారు. బుధవారం జన్నారంలో పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో జన్నారం మండల కేంద్రంలో గల పార్టీ అఫీస్ స్థలం 2 గుంటలు, రూ.7.50 లక్షలకు పార్టీకి తెలియ కుండా అమ్ముకోవడం జరిగిందన్నారు. దీనిపై పార్టీ ప్రశ్నిస్తే, తప్పు జరిగిందని ఆత్మవిమర్శ పత్రం రాసి ఇచ్చి, స్థలం కొని ఇస్తానని అంటూ కాలయాపన చేస్తూ ఎగ్గొట్టాలనే ఉద్దేశంతో వ్యతిరేక కార్యకలాపాలు పాల్పడుతున్నారన్నారు. అలాగే ఆర్థిక అరాచకాలు చేస్తూ, పార్టీకి వెన్నుపోటు పొడుస్తూ, బూర్జువా రాజకీయాలు చేస్తూన్నాడన్నారు. కాబట్టి అతనిని న్యూ డెమోక్రసీ నుంచి బహిష్కరిస్తున్నాం అన్నారు. పార్టీ స్థలాన్ని పార్టీకి తిరిగి అప్పగించక పోతే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.రాజు, రాష్ట్ర నాయకులు వెంకట నారాయణ, రాజేష్, జిల్లా నాయకులు లక్ష్మి కాంతం పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులు అమ్మితే కఠిన చర్యలు



నవతెలంగాణ-కౌటాల

కాలంచెల్లిన మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ జాటోత్ మనోహర్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. ఎరువుల దుకాణాల యజమానులు ఎరువులను ఈపాస్ మిషన్ ద్వారానే అమ్మకాలు చేయాలని, లేనిచో లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. గడువు తీరిన పురుగుల మందులు షాపులో ఉంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కాగజ్‌నగర్ సహాయ సంచాలకులు జాటోత్ మనోహర్ హెచ్చరించారు. గడువు తీరిన మందులు షాపులో ఉంచినట్టయితే, రికార్డులు సక్రమంగా నిర్వహించకుంటే అమ్మకపు నిలుపుదల నోటీసులను అందజేయడం జరుగుతుందని సూచించారు. ఆయన వెంట మంల వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేష్ ఉన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను బుధవారం వ్యవసాయ అధికారి మిలింద్‌కుమార్ తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లను పరిశీలించి రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఎరువులు, రసాయన మందులు అధిక ధరలకు విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని ఆయన రైతులను కోరారు. ప్రతి ఒక రైతు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు.

స్థానికులకే ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి



నవతెలంగాణ-కెరమెరి

రాబోవు ఎన్నికల్లో స్థానికులకే ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవినాయక్, జిల్లా అధ్యక్షుడు రూప్ లాల్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో స్థానిక సేవాలాల్ సేన ముఖ్య నాయకులతో కలిసి మాట్లాడారు. ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు స్థానికంగా ఉన్న నాయకులను గుర్తించి, వారినే అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించాలని స్థానికేతరులకు అసెంబ్లీ టికెట్లు కేటాయిస్తే జిల్లాలోని గిరిజన తండాలు, గుడాలలో ఆ పార్టీ అభ్యర్థులను తిరగనివ్వబోమన్నారు. ఎన్నికల సమయంలో స్థానికేతర అభ్యర్థుల ప్రచారాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. స్థానికులకె ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే ఆ పార్టీ వెంబడి స్థానిక తండాలు, గిరిజన గుడాల ప్రజలు అండగా నిలబడతారని చెప్పారు. ఎన్నికలకు ఐదు నెలల సమయం ఉండగానే వివిధ జిల్లాలకు చెందిన అభ్యర్థులు పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారని తెలిపారు. స్థానికేతరులకు టికెట్లు కేటాయిస్తే ఎన్నికల్లో గెలిచాక పత్తా లేకుండా పోతారని చెప్పారు. దీంతో ప్రజలకు అందుబాటులో లేకుండా, సమస్యలు పరిష్కరించలేని దుస్థితి నెలకొంటుందన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ అభివృద్ధి చెందాలంటే స్థానిక అభ్యర్థులకు ఎంనుకోవడంలో ప్రజలు ఆలోచించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాటోత్ రాజు నాయక్, అమర్ సింగ్, పరుశురాం నాయక్, లాల్ సింగ్, గంగాధర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. పాక్‌పై భారత్ సాధించిన విజయానికి సంకేతంగా నిర్వహించే కార్గిల్ విజయ్ దివస్‌ని బుధవారం మందమర్రి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆగుళ్ల తిరుమలేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు తిరుమలేష్ క్లబ్ సభ్యులతో కలిసి దేశ రక్షణలో అమరులైన వీర సైనికులందరికీ నివాళులు అర్పించారు. విజయ్ మోడలిస్ట్ అవార్డు గ్రహీత రాజేష్ ఫిహ్వాల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు తిరుమలేష్ మాట్లాడుతూ 1985లో ఆర్మీలో చేరి చైనా సరిహద్దుల్లో మొట్టమొదట డ్యూటీ చేసారు. 1999 సంలో కార్గిల్ యుద్ధ సమయంలో పఠాన్ కోట్ నుండి కార్గిల్ వరకు బుల్లెట్లు బాంబులు అందించడంలో కీలకపాత్ర పోషించారు. యుద్ధంలో విజయం సాధించినందుకు ఆపరేషన్ విజయ్ అని అప్పటి కేంద్ర ప్రభుత్వం నామకరణం చేసింది. 2005లో ఆర్మీ పదవి విరమణ అనంతరం గన్ను వదిలి పెన్ను పట్టి ఐదు పుస్తకాలు దేశభక్తిపైన రాసారని అప్పటి గవర్నర్ రమేష్ ఠాకూర్ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పుస్తకాలు అందజేయగా ప్రత్యేకంగా అభినందించారు. గొప్ప ఆర్మీ జవాన్‌ని మేము సన్మానించుకోవడం, దేశానికి వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి కొక్కుల మధు, కోశాధికారి తవటం శ్రీనివాస్, కౌట్ల అనిత, నాకోటి వెంకటేశ్వర్లు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగిన క్వార్టర్ కౌన్సెలింగ్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులకు చేంజ్ ఆఫ్ క్వార్టర్ కౌన్సిలింగ్ బుధవారం ప్రగతి మైదానంలో ఎస్‌ఓ టూ జీఎం రఘు కుమార్ పర్యవేక్షణలో రెండో రోజు కొనసాగింది. కౌన్సిలింగ్‌లో 300 మంది డైలీ రేటెడ్ ఉద్యోగులు పాల్గొనగా, 86 మంది క్వార్టర్లు తీసుకున్నారు. వీరికి వెంటనే క్వాటర్ అలాట్మెంట్ లెటర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవింద రావు, రాజేశ్వర్, ఎస్ఈ(ఈ అండ్ ఎం)మల్లయ్య, డీవై పీఎం రాజేశ్వర్ రావు, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుండె రావు, సీనియర్ అసిస్టెంట్ లక్కాకుల శ్రీధర్ పాల్గొన్నారు.

టెట్, డీఎస్సీని వెంటనే ప్రకటించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం టెట్, డీఎస్సీని వెంటనే ప్రకటించాలని బీసీ సంఘం యువజన నాయకుడు ఆవిడపు ప్రణయ్ డిమాండ్ చేశారు. అభ్యర్థులతో కలిసి కలెక్టర్, జడ్పీ చైర్ పర్సన్, డీఈఓలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో చాలా మంది బీఎడ్, డీఈడీ పూర్తి చేసుకొని డీఎస్సీ కోసం గత ఏడు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని 2017 నుండి ఇప్పటివరకు నోటిఫికేషన్ వేయలేదన్నారు. రేషనలైజేషన్ విధానంతో బీఎడ్, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు డీఎస్సీ లేకపోవడంతో పరీక్షకు సిద్ధమైన వారు ఇబ్బంది పడుతున్నారని వెంటనే టెట్, డీఎస్సీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డల ప్రణయ్, బొట్టుపల్లి ప్రశాంత్, అభ్యర్థులు కొప్పుల రాజ్ కుమార్, ఇరుకుల్ల సాయి పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

- ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్

నవతెలంగాణ-రెబ్బెన



మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ మాట్లాడుతూ మండలంలోని రైతులు పండ్ల తోటలపై అధిక దిగుబడి సాధించేలా మెలుకువలు నేర్చుకోవాలి ఆమె సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పండ్ల తోటలు మొక్కలు ప్రతి ఒక రైతు నాటి అధిక దిగుబడి సాధించేల అందరు కృషి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ అమ్జత్ పాషా, ఏఓ మంజుల, ఏపీఓ బుచ్చన్న పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌తో జీపీ ఆదాయం పెంచాలి



నవతెలంగాణ-జైనూర్

రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్ యూనిట్ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా పంచాయతీ శాఖ అధికారి సురేందర్ అన్నారు. బుధవారం మండలంలోని మార్లావాయి గ్రామంలో సౌర విద్యుత్ వెలుగులతో గ్రామ ఆదాయాన్ని పెంచుదామనే ఉద్దేశ్యంతో ఉత్తమ గ్రామ పంచాయతీ అయిన మార్లావాయి గ్రామ పంచాయతీలో ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిలో వెలుగులు నింపాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రకృతి వనాల నుంచి ఉత్పత్తిని ఉపయోగించి సౌర విద్యుత్‌ను అందించవచ్చన్నారు. భవిష్యత్తులో కాలుష్యాన్ని మనం తగ్గించుకోవచ్చుని తెలిపారు. ప్రభుత్వం ఉత్తమ గ్రామ పంచాయతీలకు ఈ ప్రాజెక్టుల కోస ం ఎన్నుకుందని తెలిపారు. మార్లావాయి గ్రామ పంచాయతీలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించి ప్రాజెక్టను ప్రారంభించారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు, ఎంపీడీఓ ప్రభుదయ, ఐకేపీ ఏపీఎం సుజాత, గ్రామ పంచాయతీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్, విద్యుత్ శాఖ ఏఈ షాదిక్‌మియా, సోలర్ వండర్ రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ సావిత్రీ ధర్మేందర్ పాల్గొన్నారు.

దేశంలోనే ఉత్తమ సీహెచ్‌పీగా నిలపాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి పరిధిలోని రాష్ట్రంలోనే ఉత్తమ సీహెచ్‌పీగా అవార్డు అందుకున్న గోలేటి సీహెచ్‌పీని దేశంలోనే ఉత్తమ సీహెచ్‌పీగా నిలిపేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని డైరెక్టర్(ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణరావు అన్నారు. బుధవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో ప్లాంట్ మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ సిస్టం(ఆటోమేషన్) సిస్టం 3.3 కేవీ/440 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. సీహెచ్‌పీ మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ విధానాన్ని గంటపాటు పరిశీలించారు. అనంతరం ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. సీహెచ్‌పీ ఆవరణలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో గోలేటి సీహెచ్‌పీ ఉద్యోగులు, అధికారులు, గోలేటి జీఎం జి దేవేందర్ డైరెక్టర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాకు త్వరలోనే పూర్వ వైభవం రానుందన్నారు. గోలేటి మెగా ఓసీపీ, ఎంఈకె ఓసీపీ త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. కష్టపడే ఉద్యోగులు, సృజనాత్మక కల అధికారులుంటే అవార్డులకు కొదువుండదన్నారు. సీహెచ్‌పీని ఉత్తమంగా తీర్చిదిద్దిన ఉద్యోగులను ఆయన అభినందించారు. ఈ నెలలో పదవి విరమణ పొందుతున్న సీహెచ్‌పీ జీఎం(ఏ అండ్ ఎం) స్వామినాయుడును ఘనంగా సన్మానించారు. అనంతరం జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో



స్వామినాయుడు అన్ని విభాగాల అధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెలలో పదవి విరమణ పొందుతున్న సందర్భంగా బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ హెచ్‌ఓడీలతో కలిసి సన్మానించి మొక్కను బహూకరించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు, పీఓఎస్ సత్యనారాయణరావు, డీజీఎం(ఈ అండ్ ఎం) గోలేటి సీహెచ్‌పీ జాడె భీంరావు, పీపీఓసీటు పీఓ ఉమాకాంత్, డీజీఎం సివిల్ సతీష్‌బాబు పాల్గొన్నారు.

రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేసిన పోలీసులు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వేంపల్లి గేటు నుంచి సిర్పూర్ గ్రామంలో గల రోడ్లపై ఏర్పడిన గుంతలను ఎస్సై దీకొండ రమేష్ బుధవారం పూడ్చి వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లి నుండి సిర్పూర్ వరకు ఈ రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందికరంగా మారిందని, వీటివల్ల వాహనదారులకు ఎన్నో ప్రమాదాలు జరిగాయన్నారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, మా సిబ్బందికి సహకరించాలన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



నవతెలంగాణ-సిర్పూర్(టి)

అటవీ ప్రాంతంలో నివసించే వన్యప్రాణులు, అటవులు మన జాతీయ సంపదని, వీటిని సంరక్షించడం మనందరి బాధ్యతని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మోహన్‌రావు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని న్యూకాలని సమీపంలో కొతమంది మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి రైల్వే పనులకు, చిరువ్యాపారం చేసుకొనే వలస కూలీలకు వన్యప్రాణులు, అటవీ సంపదపై అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానస్పందంగా తిరుగుతూ కనబడితే సమాచారం ఇవ్వాలని, అటవీ శాఖ చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట బీట్ అధికారులు షేక్ షాహెద్, నరేష్, రవీనా, బేస్‌క్యాంపు సిబ్బంది ఉన్నారు.

రాబోవు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి

- డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

నవతెలంగాణ-జైపూర్



కేసీఆర్ నియంతత్వ పాలనపై ప్రజలు విసుగుచెందారని రాబోవు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధిచెప్పాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. బుధవారం చెన్నూర్ నియోజకవర్గంలోని ఎల్‌డీఎం (లీడర్ షిప్ డెవలప్మెంట్ మిషన్) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షురాలు శ కొక్కిరాల సురేఖ, పెద్దపల్లి పార్లమెంట్ కోఆర్డినేటర్ అంజన్ కుమార్, ఎల్‌డీఎం జాతీయ కోఆర్డినేటర్ షేక్ అర్షద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని పేర్కొన్నారు. ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు. మండల అధ్యక్షులకు అనుబంధ సంఘాల నాయకులకు ఎన్నికల కోసం ఏ విధంగా కార్యాచరణ రూపొందిచాలో సూచించారు. బూత్ లెవల్‌లో పార్టీని ఏ విధంగా తీసుకపోవాలో దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ నూకల రమేష్, జనరల్ సెక్రెటరీ రఘునాథ్‌రెడ్డి, జైపూర్ కోఆర్డినేటర్ బూపతి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందే రాంచందర్, డీసీసీ ఉపాధ్యక్షుడు పుల్లురి లక్ష్మన్, పీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ఎండీ ముజాహిద్, జైపూర్ మండల అధ్యక్షుడు ఎండీ ఫయాజ్, కోటపల్లి అధ్యక్షుడు మహేష్ తివారి, చెన్నూర్ మండల అధ్యక్షుడు బాపా గౌడ్, భీమారం మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మందమర్రి మండల అధ్యక్షుడు బానోతు నీలయ్య పాల్గొన్నారు.

తాండూర్ : ప్రతి కార్యకర్త బూతు స్థాయిలో పార్టీ పటిష్టత కోసం కష్టి చేసినప్పుడే గెలుపు సాధ్యమవుతుందని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖన్నారు. బుధవారం బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్‌డీఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల సమరభేరిలో ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కష్టి చేయాలన్నారు . ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ ఇంచార్జి అంజన్ కుమార్ ఎల్‌డీఎం ఇన్‌ఛార్జి ఎండి హర్షద్, బెల్లంపల్లి నియోజకవర్గ కన్వీనర్ ఖలీద్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిలుముల శంకర్ పాల్గొన్నారు.

నియోజకవర్గ కమిటీ నియామకం

బెల్లంపల్లి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా ముచ్చర్ల మల్లయ్య, మండలఅధ్యక్షుడిగా సింగతి సత్యనారణ, భీమిని అధ్యక్షుడిగా గాదం లక్ష్మీనారాయణ, కాసీపేట రత్నం ప్రదీప్, నెన్నెల గట్టు మల్లేష్, వేమనపల్లి సయ్యద్ సాబీర్, తాండూర్ మహమ్మద్ ఈసా, కన్నేపల్లి మండలఅధ్యక్షులుగా పుప్పాల రామాంజనేయులు ఎన్నుకున్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి



నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని దేవులవాడ గ్రామం లోని పంట పొలలాను బుధవారం మండల వ్యవసాయ అధికారి మహేందర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు వర్షాకాలంలో పంట సంరక్షణ జాగ్రత్తలను తెలియజేశారు. రైతు బీమాకి ఆగస్టు 5 తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఇప్పటి వరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకొని వారు కొత్తగా పట్ట పాసు పుస్తకాము వచ్చిన వారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఉపాధి హామీ, ఉద్యాన శాఖ ద్వారా ఉద్యాన పంటలు వేసే రైతులు ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శేకర్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-తాండూర్

తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనిలో బుధవారం వేకువ జామున గంధంవేణి కృష్ణంరాజు(39) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణంరాజు మంచిర్యాల గద్దె రేగడిలో హమాలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడని గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గతంలో హైదరాబాద్ ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. రెండు రోజుల క్రితం తన అత్తగారైన తాండూర్ రాజీవ్‌నగర్ కాలకి వచ్చాడు. బుధవారం ఉదయం ఐదు గంటలకు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు సర్వ సభ్య సమావేశం

నవతెలంగాణ-కెరమెరి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉదయం 11గంటలకు తమ నివేధికలతో హాజరు కావాలన్నారు.

విత్తన దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-భీమారం



రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని విత్తన దుకాణాలకు మండల వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడేస్టన్ సూచించారు. బుధవారం మండలంలోని భీమారం, మద్దికల్, ఖాజీపల్లి, కొత్తపల్లి గ్రామాలలోని విత్తన దుకాణాలను పోలీస్‌తో కలిసి ఆకస్మిక తనికీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తన గోడౌన్‌లలో నిల్వ చేసిన విత్తనాల తోపాటు పర్చేస్ ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు. అదేవిధంగా సీడ్ లైసెన్స్, విత్తనాలను అమ్మేందుకు ధృవీకరించినల సర్టిఫికేట్, నిల్వల వివరాలతో పాటు కాలం చెల్లిన విత్తనాలను తనిఖీ చేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన డీలర్లు నకిలీ విత్తనాలను అమ్మినట్లు తమ దృష్టికి వచ్చినట్లైతే వారిపై వెంటనే కేసులు నమొదు చేసి దుఖణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో శ్రీరాంపూర్ సీఐ రమేష్ బాబు, జైపూర్ ఎస్సై నాగార్జునా, భీమారం ఎస్సై రాజవర్ధన్ పాల్గొన్నారు.

జైపూర్ : వ్యవసాయ, పోలీస్ శాఖ అధ్వర్యంలో బుధవారం మండలంలోని ఫెర్టిలైజర్ షాప్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని జైపూర్, దుబ్బపల్లి, ముదికుంట, షెట్ పల్లి, కుందారం, కిష్టపూర్ గ్రామాల్లో శ్రీరాంపూర్ సీఐ రమేష్ బాబు, ఎస్సై నాగరాజు, ఏఓ మార్క్ గ్లాడ్సన్‌లు ఫర్టిలైజర్ షాప్‌లు తనిఖీ చేశారు. షాపుల్లో ఎరువుల స్టాక్, బిల్ బుక్స్, సీడ్స్ లైసెన్స్, కాలంచెల్లిన మందులు, ఎరువులను పరిశీలించారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని షాప్ యజమానులకు సూచించారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగికి సన్మానం

నవతెలంగాణ-జైపూర్

ఇందారం ఓసీపీలో విధులు నిర్వహిస్తున్న గౌస్ భాషా బదిలీపై వెళ్తున్న సందర్భంగా టీబీజీకేఎస్ నాయకులు బుధవారం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ బ్రహ్మాజీరావు, నాగన్న, ఉన్నత అధికారులు, గని ఫిట్ సెక్రెటరీ గడ్డం మల్లన్న, రత్నాకర్‌రెడ్డి, కార్మిక సంఘం నాయకులు భూమయ్య, రమణ కుమార్, వెంకటేశ్వర్లు, గోపాల్, దేవేందర్‌రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

నవతెలంగాణ-కెరమెరి



అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఎంపీపీ పెందూర్ మోతీరాం అన్నారు. బుధవారం మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలైన పరం దొలి, ముకద్దంగూడ గ్రామాలను సందర్శించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో చేపట్టిన మన ఊరు-మన బడి కార్య క్రమంలో భాగంగా పాఠశాలలో సాగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు చిన్న పిల్లలకి గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసర ప్రాంతాల్లో చెత్త పడేయకుండా పంచాయతీ వాహనాల్లో వేయాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీఓ మహేందర్, స్థానిక సర్పంచ్‌లు పతంగే లింబాధాస్. సుంగే బాలాజీ, టెక్నికల్ అసిస్టెంట్ మహేందర్ ఉన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్



నవతెలంగాణ-జన్నారం

నేరాల నియంత్రణకే కార్డాన్ సెర్చ్‌ను నిర్వహించడం జరుగుతుందని లక్షెట్టిపేట సీఐ కృష్ణ జన్నారం ఎస్సై పి.సతీష్‌లు అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని జువ్విగుడలో కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అక్రమంగా గుడుంబా కాచిన అమ్మిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పమన్నారు. గ్రామంలోని ప్రజలు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఎలాంటి అవసరాలు ఉన్న పోలీసులను ఆశ్రయిస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కురుస్తున్న భారీ వర్షాలకు పురాతన పెంకుటిల్లలో గుడిసెలలో ఉండకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ప్రజలకు సూచించారు. ప్రజల కోసం పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి ఎస్సై ప్రసాద్ పాల్గొన్నారు.

నవతెలంగాణ

పీరీల బంగ్లాను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పాటు పడుతోందని ఎమ్మెల్యే జోగు రామన్న స్పష్టం చేశారు. మావల మండల పరిధిలోని దుబ్బగూడలోని సవారి బంగ్లా షెడ్‌ను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి ఆసరాగా నిలబడుతూ బృహత్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. స్థానిక ప్రజలు మొహరం పండగను ఘనంగా జరుపుకుంటారన్న ఉద్దేశంతో సవారి బంగ్లాలు, షెడ్ల నిర్మాణాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కుంటున్న ఇబ్బందులకు తక్షణ పరిష్కార మార్గాలు చూపుతున్నామని తెలిపారు. ప్రజలకు ఇవ్వని హామీలను సైతం అమలు చేశామన్న ఎమ్మెల్యే ఇచ్చిన హామీలను సైతం పూర్తిస్థాయిలో అమలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బిఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి బాయినవార్ గంగారెడ్డి, దర్శనాల సంగీత ఏవన్, బిఆర్ఎస్ నాయకులు నల్ల రాజేశ్వర్, రాగం గోవర్ధన్, సర్పంచ్ రాగం గంగమ్మ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పెన్‌గంగా పరివాహక ప్రాంతంలోని బేల, జైనథ్ మండలాలోని గ్రామాల్లో పంట నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం ఎకరాకు రూ.25వేలు అందిచాలని బీజేపీ నాయకురాలు సుహాసినిరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. విత్తనాలు ఉచితంగా అందించాలని, కొన్ని గ్రామాల్లో వర్షం నీరు ఇండ్లలోకి రావడం వల్ల ఇండ్లు కూలిపోయి, నిత్యావసరాలు కొట్టుకుపోయాయని అలాంటి వారిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

30 కిలోమీటర్లకు టీ-90 టికెట్ అమలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



తెలంగాణ ఆర్టీసీ నూతనంగా 30 కిలోమీటర్లు పరిధికి టీ-90 టికెట్ అమల్లోకి తీసుకువచ్చినట్లు డిపో మేనేజర్ శ్రీధర్ తెలిపారు. నూతన టీ-90 టికెట్ గురించి వివరిస్తూ కొత్తగా టీ-90 (30కిలోమీటర్ల) రోజువారి బస్సు పాస్ ప్రవేశపెడుతున్నామన్నారు. ఈ టికెట్ ధర రూ.50 తీసుకున్న వారికి పల్లె వెలుగు బస్సులలో ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ప్రయాణించవచ్చని 30 కిలోమీటర్ల పరిధిలో రానుపోను ప్రయాణించే వెసులుబాటు ఉంటుందని, రూ.20 కాంబితో ఎక్స్ ప్రెస్ బస్సులలో ప్రయాణించే సదుపాయం ఉంటుందని అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో రైతులు ఆర్థికంగా బలపడేందుకు తోడ్పడే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. బుధవారం టాటా ట్రస్ట్ తెలంగాణ రీజినల్ మేనేజర్ భగీరథ గోప్, సుస్మిత(ఢిల్లీ), చితోరే(ముంబై)లు కలెక్టర్‌ను కలిసి జిల్లాలోని కౌటాల, ఆసిఫాబాద్, వాంకిడి మండలాలలోని గ్రామాలలో వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులపై అధ్యయనం చేసి పరిష్కారం కొరకు చేపట్టవలసిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు వ్యవసాయ రంగంతో పాటు పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమలలో ఆర్థికంగా బలపడేందుకు టాటా ట్రస్ట్ ప్రతినిధులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వాసు, పద్మాకర్ పాల్గొన్నారు.

కుటుంబాలను పరామర్శించిన అనిల్ జాదవ్

నవతెలంగాణ-తలమడుగు

ఉమ్డం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోండ్ల మధుకర్ కొడుకు నవీన(23) మంగళవారం గుండెపోటుతో మరణించగా బుధవారం నేరడిగొండ జడ్పిటిసి, బీఆర్ఎస్ నాయకుడు అనిల్ యాదవ్ కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా కుచులాపూర్ గ్రామానికి చెందిన రాములు ఆత్మహత్యకు పాల్పడగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పల్సి-బి తండా గ్రామానికి వెళ్లి పలువురిని పరామర్శించారు. అక్కడి నుండి కొత్తూరు వెళ్లి గ్రామ పీరీలను దర్శించుకున్నారు. అనిల్‌జాదవ్ వెంట మండల బిఆర్ఎస్ నాయకులు ముడుపు కేదారేశ్వర్‌రెడ్డి, నాయకులు తిరుమలగౌడ్, రమాకాంత్, జావీద్, పాండురంగ్, గుణవంత్‌రావు, దేవేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నానక్‌సింగ్, వెంకట్రావ్, ఇమ్రాన్, భీంరావ్, సాబీర్ ఉన్నారు.

తాంసి : వారం రోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన రెండ్ల సంతోష్‌తో పాటు భగత్ మల్లాజి భార్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని నేరడిగొండ జెడ్పీటీసీ అనీల్‌జాదవ్ బాధిత కుటుంబాలను బుధవారం పరామర్శించారు. అనంతరం మొహరం పండుగ సందర్భంగా సవార్లను దర్శించుకున్నారు. ఆయనను గ్రామ సర్పంచ్‌తో పాటు బంగ్లా నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కాంతరెడ్డి, రజినీకాంత్‌రెడ్డి, తిరుమల్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఆఫ్రోజ్ పాల్గొన్నారు.



పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



నవతెలంగాణ-జన్నారం

గ్రామాల్లో పారిశుధ్యంపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మంచిర్యాల డీపీఓ ప్రభాకర్ రావు అన్నారు. బుధవారం మండలంలోని గ్రామపంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీలో ఉన్న రికార్డులను పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. గ్రామపంచాయతీలోని ప్రతి రోడ్డు, నాలీలు శుభ్రంగా ఉంచాలని, ఇంటింటి తిరిగి చెత్త సేకరణ చెయ్యాలని సర్పంచ్ కార్యదర్శులకు సూచించారు. రోజు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటికి చెత్త సేకరణ జరగాలని, ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్లిన చెత్తను డంపింగ్ యార్డ్‌లో చెత్తను వెయ్యాలనన్నారు. తయారైన కంపోస్టు ఎరువును పీపీవీ ఎవన్యూ ప్లానిటేషన్‌లోని మొక్కలకు వేయాలన్నారు. క్రిమిటోరియం చుట్టు మొక్కలు నాటించాలని, గ్రామపంచాయతీ పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలన్నారు. పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉన్నందున ఇతర కూలీలతో పారిశుద్య పనులను చేయించలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. హరిత హారంలో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి స్థాయిలో మొక్కలు నాటాలన్నారు. స్వచ్ఛ సర్వెక్షన్‌లో గ్రామంలో ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో దోమల నివారణకు బోటెక్స్ ఫాగ్గింగ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కవ్వాల్ గ్రామ సర్పంచి లక్ష్మీకాలిరాం, ఈఓపీఆర్డీ రమేష్, కార్యదర్శి అజాజ్ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

చింతగూడ గ్రామంలో స్పర్శ ఫౌండేషన్, సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ సీఈఓ కపిల్ కౌల్ మాట్లాడుతూ మహిళలు స్వయంగా ఉపాధి పొందాలనే ఉద్దేశ్యంతో కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ వాడకం నిషేధించి గుడ్డ సంచి వాడాలని సూచించారు. జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం నిషేధించడం అందరి బాధ్యత అని, కుట్టు శిక్షణ కేంద్రం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవిశంకర్, సర్పంచ్ అత్రం సంజీవ్, మిల్లు ప్రతినిధి తుమ్మ రమేష్, ఏపీఎం ముక్తేశ్వర్, విద్యభూశన్, అశోక్, సుశీల పాల్గొన్నారు.



ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డుల అందజేత

ఆసిఫాబాద్ : ట్రాన్స్ జెండర్లకు ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులను బుధవారం ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డీడబ్ల్యూఓ సావిత్రితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐదుగురు ట్రాన్స్ జెండర్లకు సమాజంలో గుర్తింపునిస్తూ ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులను అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి రవికుమార్, ట్రాన్స్ జెండర్లు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా అదనపు కలెక్టర్‌గా డి.వేణు బుధవారం సమీకృత కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. గతంలో జిల్లాలో పనిచేసిన ఆదనపు కలెక్టర్ రాజేశం ఆదిలాబాద్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే.

బదిలీ ఎస్సైని సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కెరమెరి

స్థానిక పీఎస్‌లో విధులు నిర్వహించి చింతల మానేపల్లికి బదిలీపై వెళ్లిన ఎస్సై వెంకటేష్ ను బీఆర్ఎస్ యువ నాయకులు సన్మానించారు. అంకితభావంతో పని చేసి సామాన్య ప్రజలకు సేవలందించిన ఎస్సైని అభినందించారు. ఈ కార్యక్రమంలో కోవలక్ష్మీ యూత్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, కంబాల వినేష్, వెంకటి, గోపాల్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

రైతు బీమా నమోదయ్యేటట్టు చూడాలి

నవతెలంగాణ-ముధోల్

ప్రతి ఏఈవో క్లస్టర్ పరిధిలోని రైతుల రైతు బీమా నమోదైనట్లు చూడాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్ అన్నారు. మండలంలోని తరోడా రైతు వేదికలో బుధవారం బాసర, తానూర్, ముధోల్, లోకేశ్వరం ఏఈవోలతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఏఈఓ సంబంధిత రైతుకు రైతుబీమా గురించి అవగాహన కల్పించి నమోదు అయ్యేటట్టు చూడాలన్నారు. అలాగే రైతులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పలు సలహాలు, సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్లస్టర్ వారీగా పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ మీనా, ముధోల్, లోకేశ్వరం ఏవోలు అజ్మీర భాస్కర్, గణేష్ ఏఈవోలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా గాధం లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-భీమిని

మండలలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన గాధం లక్ష్మీనారాయణ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియమించినందుకు మాజీ మంత్రి గడ్డం వినోద్ కుమార్, సహకరించిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కార్యాకరి రామచందర్, మండల నాయకులు సంగర్స రవీందర్‌రావు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు.

పీరీల ఊరేగింపు

నవతెలంగాణ-కౌటాల

మొహర్రం వేడుకలను మతాలకు అతీతంగా వారం రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పీరీలను నిలుపుకొని వేడుకలు జరుపుకుంటారు. అందులో భాగంగా మండలంలోని గుండాయిపేట్ గ్రామంలో ఏర్పాటుచేసుకున్న పీరీలను ఊరేగింపుగా వీర్దండి గ్రామానికి బయలుదేరి గ్రామంలో సవారీల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లింలతో పాటు హిందువులు సైతం పాల్గొన్నారు.